# నమస్తే తెలంగాణ

## జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శనివారం 15 మార్చి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY




వనపర్తిలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## వాగ్దానాలపై ప్రశ్నిస్తే సస్పెన్షనా..?

- **జగదీశ్‌రెడ్డిపై చర్య అనైతికం**
- **వనపర్తిలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**

వనపర్తి, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : ప్రజాస్వామ్యంలో ప్రజల తరపున ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని ఏకపక్షంగా సస్పెండ్ చేయడం అనైతికం అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం వనపర్తిలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గట్టుయాదవ్ మాట్లాడుతూ ఒక పక్క యాసంగి పంటలు ఎండిపోతున్నాయి.. మరోపక్క ప్రభుత్వ పాలన పక్కదారి పట్టిందని, అసెంబ్లీలో మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అడిగితే ఆయన్ను సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని మాట్లాడిన మాజీ మంత్రిని పథకం ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని ఆరోపించారు. అన్‌పార్లమెంటరీ పదాలు మాట్లాడారని తప్పుడు అభియోగంతో సస్పెండ్ చేసిన ప్రభుత్వ చర్యను ప్రతి ఒక్కరు మీడియాలో చూసి నవ్వుకుంటున్నారన్నారు. దళిత స్పీకర్ పేరు చెప్పి కాంగ్రెస్ అసెంబ్లీలో కూడా రాజకీయాలు చేస్తూ సభను తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. వెంటనే జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్, నాయకులు నందిమళ్ల అశోక్, కృష్ణ, నాగన్నయాదవ్, తిరుమల్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, శ్రీనివాసులు, పాషా, అలీం, శివ, భరత్ పాల్గొన్నారు.



జడ్చర్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## హోరెత్తిన బీఆర్ఎస్ నినాదాలు

- **జడ్చర్లలో సీఎం దిష్టిబొమ్మ దహనం**

జడ్చర్లటౌన్, మార్చి 14 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి అసెంబ్లీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయటం అప్రజాస్వామిక పాలనకు నిదర్శనమని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య అన్నారు. మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జడ్చర్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేసి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతున్నదని, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక పాలకులు తప్పుదోవపట్టించే కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. ఏడాదిన్నర పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు విసుగుచెందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మురళి, శ్రీకాంత్, హఫీజ్, నందకిశోర్, కృష్ణారెడ్డి, సోహేల్, సుభాన్, కరాటే శ్రీను, సునీత్, వీరేశ్, ప్రశాంత్‌రెడ్డి, వెంకటేశ్, ప్రణీల్‌చందర్, మచ్చుల శ్రీను పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



మహబూబ్‌నగర్ ఇఫ్తార్ విందుకు హాజరై మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- **మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 14 : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ రహమత్ మసీదులో అబ్దుల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై ముస్లిం మత పెద్దలకు ఖర్జూర పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండడంతో ముస్లిం సోదర, సోదరీమణులు తగిన జాగ్రతలు తీసుకుంటూ ఉపవాస దీక్షలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ముస్లిం నేతలు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఒంటిపూట బడులు



పాఠశాలలో డిజిటల్ పాఠాలు పరిశీలిస్తున్న డీఈవో

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 14 : నేటి నుంచి జిల్లాలో ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 15 శనివారం నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ఉదయం 7:45 గంటల నుంచి 12:30గంటల వరకు విద్యాసంస్థలు కొనసాగుతాయి. పదో తరగతి పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1:15గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వారి కోసం ప్రత్యేక తరగతులు ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యా జమాన్యంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఈ ఆదేశాలను అమలు చేసేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ఏఐ కంప్యూటర్ శిక్షణ**

ఈ నెల 15వ తేదీ నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థులకు ఏఐ కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని ప్రభుత్వ పోలీసులైన్ ప్రాథమిక పాఠశాల, పీఎస్ రాంనగర్, సీసీకుంట మండలంలోని ఎంపీపీఎస్ ఉంద్యాల, ముచ్చింతల, దేవరకద్ర మడలంలోని ఎంపీపీఎస్ డోకూరు, ఎంపీపీఎస్ గోపన్‌పల్లి, అడ్డాకుల మండలంలోని ఎంపీపీఎస్ రాచాల, ఎంపీపీఎస్ కన్మనూర్, బాలానగర్ మండలంలోని ఎంపీపీఎస్ నేరెళ్లపల్లి, గండీడ్ మండలంలోని ఎంపీపీఎస్ బాల్‌సూర్‌గొండ తదితర పాఠశాలల్లో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.



గద్వాల నిరసనలో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ప్రశ్నించే గొంతుకలు నొక్కుతారా?

- **బీఆర్ఎస్ నేత బాసు హనుమంతు నాయుడు**

గద్వాల, మార్చి14 : స్పష్టమైన కారణం లేకుండా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం హేయమైన చర్యగా గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నేత బాసు హనుమంతు నాయుడు అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గద్వాల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గులాబీ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. అనంతరం కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ మాటల్లో ఎటువంటి తప్పిదాలు లేకున్నా స్పీకర్ ఉద్దేశ్యపూర్వకంగా ఎమ్మెల్యేను సస్పెండ్ చేశారని ధ్వజమెత్తారు. ప్రశాంతంగా దిష్టిబొమ్మ దహనం చేస్తామని చెప్పినా పోలీసులు మా నిరసనకు అనుమతి ఇవ్వకుండా అడ్డుపడ్డారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేరుకేమో ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకుంటూ ప్రజల తరపున మాట్లాడే వారి గొంతునొక్కడం ఏమిటని ప్రశ్నించారు. శాసనసభలో ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తూ నిరాధరణ ఆరోపణలతో ఆయన్ను సస్పెండ్ చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మోనేశ్, బీచుపల్లి, రాజు, శ్రీరాములు, తిరుమలేశ్, తిమ్మప్పగౌడ్, ఆటో మగ్బూల్, మౌర్య, వసుంధర, రమేశ్, గంగాధర్, ఆంజనేయులు, ఇమ్మానియల్, అనిల్, కామేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సస్పెన్షన్ అవివేకం

- **నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్ ర్యాలీ**

నాగర్‌కర్నూల్, మార్చి 14: ప్రజల తరపున శాసన సభలో ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అవివేకమని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసినందుకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదేశానుసారం శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలలుగా ప్రజల తరుపున పోరాటం చేస్తున్న ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు, జర్నలిస్టులపై కేసులు పెడుతూ ప్రశ్నించే గొంతులను నొక్కాలని ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలోనే గురువారం ఘటన చీకటి రోజు అని, కాంగ్రెస్ పార్టీ పట్టపగలు ప్రజాస్వామ్యం గొంతుకోసిందన్నారు. అసెంబ్లీ బయట ప్రశ్నిస్తే కేసులు, అక్రమ అరెస్టులు చేయడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే జగదీశ్ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకు సస్పెండ్ చేస్తారా? అని ప్రశ్నించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలం, హన్మంత్‌రావు, రమణతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## సస్పెన్షన్ ఎత్తేయాలి

- **ఆరుగ్యారెంటీలపై నిలదీస్తారనే కాంగ్రెస్ ప్రభుత్వానికి భయం**
- **అచ్చంపేటలో బీఆర్ఎస్ నేతల నిరసన**

అచ్చంపేటటౌన్, మార్చి 14 : మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై అసెంబ్లీలో విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన మేరకు శుక్రవారం అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అమీనొద్దీన్ మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రతిపక్షం అనేది లేకుండా చేయాలనే దురుద్దేశంతో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు చేస్తున్న మోసాన్ని అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎండగడతాడనే ఉద్దేశంతో అనని మాటలు అన్నట్లు చూపించి అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమేశ్‌రావు, నాయకులు కుతుబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ భగ్గు భగ్గు

**ఉమ్మడి జిల్లాలో పెల్లుబికిన ఆగ్రహం**

- **ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడంపై నిరసన హోరు**
- **పలుచోట్ల సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనాలు**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ నిరసనలు హోరెత్తాయి. శాసన సభ నుంచి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడంపై ఆగ్రహం పెల్లుబికింది. కాంగ్రెస్ అప్రజాస్వామిక వైఖరికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. పలు చోట్ల బీఆర్ఎస్ నేతలు రోడ్లపైకి రాకుండా పోలీసులు అడ్డుకొని.. అరెస్టు చేశారు. అయినా ఆయా నియోజకవర్గాల్లోని కూడళ్ల వద్దకు గులాబీ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకొని ఆందోళనలు కొనసాగించారు. గద్వాల, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, అచ్చంపేట, కొల్లాపూర్ పట్టణాల్లో ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను కాంగ్రెస్ ప్రభుత్వం నొక్కేసే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. 15 నెలలుగా ప్రభుత్వంపై ప్రజల తరుపున ఆరె గ్యారెంటీల విషయమై పోరాటం చేస్తున్న.. ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, జర్నలిస్టులపై కేసులు పెడుతున్నారని విమర్శించారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మార్చి 14



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



కొల్లాపూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## సీఎం దిష్టిబొమ్మ దహనం

కొల్లాపూర్ రూరల్, మార్చి 14 : మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ నుంచి అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రశ్నించినందుకు ఆయనను సస్పెండ్ చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెడుతూ జైలుకు పంపించే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ప్రజాపాలన అని చెప్పుకుంటూనే ఎమర్జెన్సీ పాలను తలపించేలా చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా తన తీరును మార్చుకోకపోతే ప్రజలు తగిన బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సాంబశివుడు, మాజీ ప్రజాప్రతినిధులు కాటం జంబులయ్య, పాండునాయక్, సురేందర్‌రావు, మూలె కేశవులు, పుట్టపాగ రాముడు, బిజ్జ వేణు, కలమంద శేఖర్, కలర్ మహేశ్, శీలం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి వినతి

కొత్తకోట, మార్చి 14 : మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వామన్‌గౌడ్, మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తకోట చౌరస్తాలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. శాసన సభలో ఆరు గ్యారెంటీలపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడితే సస్పెండ్ చేస్తారా..?అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాడని, ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగే సభ్యులను సస్పెండ్ చేయడం, అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి గాడీల ప్రశాంత్, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాసులు, యూత్ అధ్యక్షుడు నెహ్రూ, శ్రీనూజీ, అద్వాని శ్రీను, రాములు యాదవ్, కృష్ణయ్యగౌడ్, బాబా, దాసరి విజయ్, సత్యం యాదవ్, కిరణ్, షకీల్, రాజు, గోవర్ధన్, ఇజ్రాయిల్, ప్రభుదాస్, వెంకటయ్య, నాగన్న, సంద శ్రీనుతోపాటు పలువురు పాల్గొన్నారు.





కొత్తకోటలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## టీబీ డ్యాం నుంచి నిలిచిన నీటి విడుదల

- **ఆర్డీఎస్‌లో నీటి నిల్వ 8.6 అడుగులు**
- **ప్రధానకాల్వకు 632 క్యూసెక్కులు విడుదల**

అయిజ, మార్చి 14 : ఆర్డీఎస్ నీటివాటా ముగిసింది. ఈ ఏడాది కర్ణాటకలోని టీబీ డ్యాంకు వచ్చిన వరద నీటి జలాలకు అనుగుణంగా ఆర్డీఎస్ ఆయకట్టుకు 5.896 టీఎంసీలను టీబీ బోర్డు కేటాయింపులు జరిపింది. 5.896 టీఎంసీల నీటిని ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన వానకాలం, యాసంగి పంటలకు ఐదు విడుతలుగా టీబీ డ్యాం ద్వారా అధికారులు ఇండెంట్ పెట్టి విడుదల చేయించారు. ఈ నెల 13 నాటికి ఆర్డీఎస్ నీటివాటాను పూర్తిగా వినియోగించారు. అలాగే ఏపీలోని కర్నూల్, నంద్యాల, కడప జిల్లాలకు సాగు, తాగునీటిని అందించే కేసీ కెనాల్ ఇండెంట్ 7.05 టీఎంసీలు సైతం ముగిసింది. ఆర్డీఎస్, కేసీ కెనాల్ 40–60 రేషియో ప్రకారం ఉమ్మడి ఇండెంట్ నీటిని టీబీ డ్యాం ద్వారా తుంగభద్ర నదిలో తీసుకున్నారు. దీంతో ఇరు రాష్ర్టాల నదీతీర ప్రాంత పల్లెలు, పట్టణాల తాగునీరు, సాగునీటికి ఇక్కట్లకు గురికావాల్సి వస్తుందని ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని అయిజ మండలంలోని రైతులు యాసంగిలో వరి పంట అధిక మొత్తంలో సాగు చేశారు. ఆరుతడి పంటలకు భూములు అనువైనవి కాకపోవడంతో రైతులు వరిసాగు వైపే మొగ్గుచూపారు. ప్రస్తుతం పంటలు పాలుపోసే దశలో ఉండడంతో ఏప్రిల్ రెండో వారం వరకు సాగునీరు అందితే పంటలు చేతికొస్తాయని, లేకపోతే 50 శాతం పంటలు ఎండుతాయని ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికార యంత్రాంగం కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి టీబీ డ్యాం నుంచి మరో రెండు టీఎంసీల నీటిని విడుదల చేయించి పంటలను కాపాడాలని, ఆ దిశగా సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ 8.6 అడుగులు ఉండగా, ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 632 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని డీ–25 వరకు చేరాయని ఆయన వెల్లడించారు.

**తుంగభద్ర డ్యాంలో ..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటక, ఏపీ రాష్ర్టాల సాగు, తాగునీటి అవసరాలకు 8,790 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 22.126 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1600.46 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘువేంద్ర తెలిపారు.




జీల్దార్ తిప్ప చెరువు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

## జీల్దార్‌తిప్పకు సాగు నీరు అందించాలి

కొల్లాపూర్, మార్చి 14 : కొల్లాపూర్ మండలంలోని నల్లమలలో ఉన్న జీల్దార్‌తిప్ప చెరువుకు సాగునీరు అందించాలని రైతు సంఘం మండల కార్యదర్శి బాలపీరు, మాజీ సర్పంచ్ హైమావతి నాయకులు బాలస్వామిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జీల్దార్‌తిప్ప చెరువు వద్ద రైతులతో కలిసి వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్దార్‌తిప్ప చెరువు కింద ఐదు వేల ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయని పేర్కొన్నారు. వర్షాలు పడితేనే చెరువు నిండుతోందని చెరువు నిండకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అధికారులు జిల్దార్ తిప్ప చెరువుకు వున్న తూముకు వెంటనే మర్మతులు చేసి కనీసం రబీ పంటలైనా కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు



వనపర్తి జిల్లా కేంద్రంలో హోలీ వేడుకల్లో పాల్గొని రంగులు పులుముకొంటున్న యువత



కొల్లాపూర్‌లో హోలీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బీరం

## రంగు పడింది

- **ఉమ్మడి జిల్లాలో ఘనంగా హోలీ వేడుకలు**
- **ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు, యువత**
- **కొల్లాపూర్ రంగేళీలో మాజీ ఎమ్మెల్యే బీరం**
- **సంబురంగా.. రంగులు చల్లుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు**